బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

మసీద్‌లో అవగాహన కల్పిస్తున్న షూర్ ఎన్జీవో, డీసీపీయూ సిబ్బంది

ఎదులాపురం, మార్చి 26 : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీపీయూ సిబ్బంది ప్రేమ్ అన్నారు. బుధవారం అదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీలోని మక్కా మసీద్‌లో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ కిరణ్‌తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీయూ సిబ్బంది ప్రేమ్ మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం జేజేబీ కోర్టు, చైల్డ్ లైన్, ఐసీపీఎస్, షూర్ ఎన్జీవో పని చేస్తున్నాయని తెలిపారు. ఆపదలో ఉన్నవారు భయపడకుండా డయల్ 100, 181, 1098నం బర్లకు కాల్ చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కమిటీ సభ్యులను షూర్ ఎన్జీవో సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ అజర్ అలీ, ప్రధానకార్యదర్శి అబ్దుల్ రషీద్, కోశాధికారి తౌఫీక్, మౌలానా ఫిరోజ్, ఇమామ్ సాహబ్, హఫీజ్, సయ్యద్ జుబైర్, మౌజాన్ సాహబ్, ఆరిఫ్,ఫరీద్ పాల్గొన్నారు.

అందని యునాని వైద్య సేవలు

నిర్మల్ లో తాళం వేసి ఉన్న యునాని దవాఖాన

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 26 : గ్రామీణ ప్రజలకు యునాని వైద్య సేవలం దించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్మల్ వైద్య కళాశాల దవాఖానలో యునాని దవాఖాన ఏర్పాటు చేయగా రోగులకు మాత్రం సేవలు అందడం లేదు. నిర్మల్‌లోని దవాఖానకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. దవాఖాన మూసి ఉండడంతో రోగులకు వైద్యం అందని ద్రాక్షలాగా మారింది. ఇక్కడ పని చేస్తున్న వైద్యురాలు డిప్యుటేషన్‌పై హైదరాబాద్‌కు వెళ్లగా ఫార్మాసిస్టు పోస్టు ఖాళీగా ఉంది. దీంతో దవాఖాన తాళం వేసి ఉంటుంది. రోగులు నిత్యం దవాఖానకు వచ్చి తాళం వేసి ఉండడం చూసి వెనుతిరిగిపోతున్నారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన దవాఖాన నిరుపయోగంగా మారింది. కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి దవాఖానలో యునాని వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధితులకు సత్వర న్యాయం

భైంసా, మార్చి 26 : బాధితులకు సత్వర న్యాయం చేయడానికే ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహిస్తున్నామని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో భరోసా సెంటర్‌ను ప్రారంభించి ఆమె మాట్లాడారు. ప్రతి బుధవారం భరోసా సెంటర్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, కాబట్టి అనుభవజ్ఞులైన కౌన్సిలర్ల యొక్క సేవలు వినియోగించుకోవాలన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారమయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందన్నారు. వివిధ ప్రాంతాల అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలు చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐలు గోపీనాథ్, నైలు, మల్లేశ్, భరోసా సెంటర్ సిబ్బంది జ్యోతి, శిరీష, క్యాంపు ఇన్‌చార్జి రఘువీర్ పాల్గొన్నారు.

భరోసా సెంటర్‌ను ప్రారంభిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

సమీక్ష సమావేశం

మాట్లాడుతున్న వీసీ గోవర్ధన్

బాసర, మార్చి 26 : ఆర్జీయూకేటీలో బుధవారం అధ్యాపకులు, అధికారులతో వీసీ గోవర్ధన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉన్నత విద్యాసంస్థలో న్యాక్ అక్రిడిటేషన్, నాణ్యమైన విద్య ప్రాముఖ్యత గురించి యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్లతో సమావేశం జరిగిందన్నారు. ఆ సమావేశంలో పలు విషయాలపై వీసీ మాట్లాడారు. నాక్ అక్రిడేటేషన్‌తో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విద్యార్థి, అధ్యాపక మార్గదర్శక కార్యక్రమాలను హైలేట్ చేసే వార్షిక నివేదికలతో ఐదేండ్ల రికార్డులను సంస్థలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని నిర్ధారించడానికి విద్యుత్, నీరు, వైద్య సౌకర్యాలు వంటి ముఖ్యమైన సేవలు అందించడంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఓఎస్‌డీ మురళీధర్శన్, ఏవో రణధీర్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

బోథ్, మార్చి 26 : గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో రమేశ్ సూచించారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా నాగపూర్, జైనూర్‌పల్లె గ్రామాలను సందర్శించారు. నీటి వసతిపై ఆరా తీశారు. చేతి పంపులు, మోటర్లు సరి చేయించి నీరు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నాగపూర్ ప్రాథమిక పాఠశాలతో పాటు జైనూర్ పల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్య బోధన, మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ఆయన వెంట ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

పంట కోతల నూర్పిడికి ధరల నిర్ణయం

బోథ్, మార్చి 26 : రైతు పండిస్తున్న పంట కోతల నూర్పిడికి బోథ్ వీడీసీ ఆధ్వర్యంలో ధరలు నిర్ణయించారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మార్కెట్ యార్డులో వీడీసీ కమిటీ సభ్యులు హార్వెస్టర్, హల్లర్ల యజమానులు, రైతులు సమావేశమయ్యారు. మక్కలు క్వింటాల్‌కు రూ.100, జొన్నలు క్వింటాల్‌కు రూ.130, జొన్నలు ఎకరం కోతకు రూ.3400 తీసుకోవాలని తీర్మానించారు. నిర్ణయించిన ధరలకే హార్వేస్టర్ల యజమానులు రైతుల దగ్గర వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో వీడీసీ చైర్మన్ అల్లకొండ పోతన్న, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ గౌడ్, కోశాధికారి రాయిపెల్లి రమాకాంత్, వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో మామిడి తోటకు వేలం

ఉట్నూర్, మార్చి 26: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉద్యానవన నర్సరీ మామిడి తోటకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో ఉట్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, జైనూర్, ఆదిలాబాద్ నుంచి 17 మంది వ్యాపారులు పాల్గొన్నారు. 2021 సంవత్సరంలో మామిడి తోటకు రూ.4లక్షల66వేలు రాగా ఈ మధ్య కాలంలో అంత ధర పలుకలేదు. ఈ సంవత్సరం ఏకంగా రూ.10లక్షల5వేలు పలికింది. ఈ వేలంలో పాల్గొన్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పంటలను పరిశీలించారు. దీనికి ఉద్యాన వన శాఖ అధికారి సందీప్, సిబ్బంది కృషి చేశారన్నారు. ఈ వేలంలో కమిటీ సభ్యులు డీటీడీవో అంబాజీ, ఏవో దామోదర స్వామి, ఉద్యానవన శాఖ అధికారి సందీప్, సిబ్బంది జయరాజు, అర్షిత, సాయిరాజ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, మార్చి 26 : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఉట్నూర్ ఆధ్వర్యంలో యువతకు బ్యూటీపార్లర్, మగ్గంవర్క్, కుట్టుమిషన్, సెల్ ఫోన్ రిపేరింగ్, హౌజ్ వైరింగ్, ఫొటోగ్రఫి, టూవీలర్ మెకానిక్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎండీ గౌస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 18 నుంచి 45 సంవత్సరాలలోపు యువత వచ్చేనెల 5వ తేదీలోపు సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఉచిత వసతితో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారికి బస్సు చార్జీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9949412159 నంబర్ సంప్రదించాలని కోరారు.

భూగర్భ జాలల పెంపునకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

నార్నూర్, మార్చి 26: భూగర్భజాలల పెంపునకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో జవహర్ లాల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని చోర్‌గావ్ గ్రామాన్ని బుధవారం సందర్శించారు. గ్రామంలోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో సాయిప్రసాద్ ఉన్నారు.

పరీక్షా కేంద్రాలు తనిఖీ

నిర్మల్ అర్బన్, మార్చి 26: నిర్మల్‌లోని రవి, వశిష్ట, ఈద్గాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని బుధవారం ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు.

దస్తురాబాద్, మార్చి 26 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని స్క్వాడ్ బృందం తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. తనిఖీ బృందంలో ఎంఈవో పరమేశ్వర్, నాయబ్ తహసీల్దార్ రమేశ్, ఏఎస్ఐ, ఎస్ఐ అశోక్ ఉన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

దిలావర్‌పూర్, మార్చి 25 : ఉపాధి హామీ కూలీలు పని చేసే ప్రదేశంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో అరుణారాణి సూచించారు. బుధవారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఎండల నేపథ్యంలో కూలీలు పని ప్రదేశానికి ఉదయం రావాలని ఆలస్యంగా వచ్చి ఎండతీవ్రత ఉండే వరకు పని చేయవద్దని సూచించారు. ఆమె వెంట ఏపీవో దివ్యరెడ్డి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ రమణ, ఫీల్డ్‌అసిస్టెంట్ మహేశ్ ఉన్నారు.

సివిల్స్, గ్రూప్స్ ఉద్యోగాలకు పోటీ పడాలి

ఎదులాపురం, మార్చి 26 : డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ ఉద్యోగాలకు నిరంతరం పోటీ పడుతూ ఉండాలని టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ (మహిళల) కళాశాల రాజకీయ శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ చైతన్య కుమారి అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషుల) కళాశాలలో విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో పుట్ట లక్ష్మణ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

భైంసా: ఇఫ్తార్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకులు

భైంసా, మార్చి 26 : నిర్మల్ జిల్లా భైంసాలోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ముస్లింకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ మాట్లాడుతూ పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజీజ్ ఖురేషి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 26 : నిర్మల్‌లోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జానకీషర్మిల రంజాన్ ఉపవాసాల సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎస్పీ ముస్లింలు, వారి కుటుంబ సభ్యులకు రంజాన్ పండుగ సందర్భంగా ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఉపేందర్‌రెడ్డి, అవినాశ్‌కుమార్, రాజేశ్‌మీనా, ఏవో యూసూప్ అలీ, ఇన్‌స్పెక్టర్లు అజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, మల్లేశ్, సమ్మయ్య, ఆర్ ఐలు రాంనిరంజన్, శేఖర్, రామకృష్ణ, రమేశ్, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న కలెక్టర్

ఎదులాపురం, మార్చి 26 : జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున ఆదిలాబాద్‌లో ఇఫ్తార్ దావత్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, డీఎండబ్ల్యూఓ రాజిలింగు, అధికారులు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఉపవాస దీక్షలు విరమించి విందు ఆరగించారు. ప్రభుత్వం తరపున కలెక్టర్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న సాధన కమిటీ దీక్షలు

మాట్లాడుతున్న నాయకులు

ఎదులాపురం, మార్చి 26: ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం ఎనిమిదో రోజుకు చేరుకోగా సీఐటీయూ అనుబంధ తెలంగాణ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు, అంగన్‌వాడీలు దీక్ష శిబిరంలో కూర్చొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్ మాట్లాడుతూ సీసీఐ పునరుద్ధరిస్తే రాబోయే తరాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో సీసీఐ కోసం నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. ఈ నెల 28న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సైతం దీక్షా శిబిరాన్ని సందర్శించనున్నారని తెలిపారు. దీక్షలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, కమిటీ కో కన్వీనర్ నారాయణ, బండి దత్తాత్రి, అరుణ్ కుమార్ తదితరులు కూర్చున్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

ఎదులాపురం, మార్చి 26 : పాత కక్షలు మనసులో పెట్టుకుని హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. ప్రభాకర్‌రావు తీర్పు వెలువరించినట్లు కోర్టు లైజన్ అధికారి ఎం గంగాసింగ్ తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలు వెల్లడించారు. 21 ఆగస్టు 2022న జైనథ్ మండలంలోని రాంపూర్(టీ)కి చెందిన నేరస్తుడు కొడిమెల ప్రభాకర్ పాత కక్షలు మనసులో పెట్టుకుని ఉట్ల రమేశ్‌ను స్థానిక బుద్ధ విహార సమీపంలో కత్తితో పొడిచి, కొట్టి హత్య చేశాడు. ఈ ఘటనపై అప్పటి జైనథ్ ఎస్ఐ బి పెర్సిస్ కేసు నమోదు చేయగా అప్పటి జైనథ్ సీఐ కే నరేశ్ కుమార్ సాక్షులను విచారించి నేరస్తునిపై చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి ఎంఏ జమీర్ 18 మంది సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేకల మధుకర్ విచారించి నిందితునిపై నేరం రుజువుఅయింది. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష తోపాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. ఈ కేసులో నేరస్తునికి శిక్ష పడడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోర్టు డ్యూటీ అధికారిని కోర్టు లైజన్ అధికారి, పీపీని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

షాపులో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి రిమాండ్

లక్ష్మణచాంద, మార్చి 26 : ఈ నెల 23వ తేదీ రాత్రి సమయంలో నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలోని గాండ్ల నవీన్ కిరాణా దుకాణంలో దొంగలించిన వ్యక్తిని పోలీసులు పట్టుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ షేక్ జుబేర్ అందించిన వివరాల ప్రకారం.. ఈ నెల 23వ తేదీన రాత్రి సమయంలో మండల కేంద్రంలోని గాండ్ల నవీన్ కిరాణా దుకాణంలో దొంగతనం జరిగింది. దుకాణంలో నుంచి రూ. 23 వేలు దొంగలించినట్లు గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగలించిన వ్యక్తిని గుర్తించి సీడీఆర్ టెక్నాలజీ ద్వారా నిందితుడు ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. చివరకు నిందితుడు లక్ష్మణచాందకు చెందిన గవానే గంగా ప్రసాద్‌ను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. సత్వరమే నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ షేక్ జుబేర్, పోలీసు సిబ్బందిని సీఐ గోవర్ధన్ రెడ్డి అభినందించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, మార్చి 26: ఇంద్రవెల్లి మండలంలోని గిన్నేరా గ్రామ పంచాయతీ పరిధిలోని బిక్కుతండాకు చెందిన సెడ్మాకి చంద్రకాంత్(35) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సునీల్ బుధవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...సెడ్మాకి చంద్రకాంత్ వ్యవసాయ కూలీ పనులు చేస్తున్నాడు. భార్య మంజులా గ్రామంలోనే అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తుంది. సెడ్మాకి చంద్రకాంత్ వారంరోజుల నుంచి జ్వరంతో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరిస్తుండడంతో కుటుంబ సభ్యులు మంగళవారం ముత్నూర్ గ్రామంలో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి వైద్యం అందించారు. భార్య అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సెడ్మకి మంజులా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలి



పూజలు చేస్తున్న మాజీమంత్రి జోగు రామన్న, నాయకులు

బేల, మార్చి 26: చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలం అవల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 4వ ఆధ్యాత్మిక సత్సంగ్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆధ్యాత్మికత ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంభీర్ ఠాక్రే, తేజ్‌రావ్, సతీశ్ పవార్, సునీల్, విశాల్‌గోడే, సురేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 26 : నిర్మల్ జిల్లాలోని వెనుకబడిన తరగతులు(ఈబీసీ) ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను ఆన్‌లైన్ https://tgobmms.cgg.gov.in ద్వారా ఏప్రిల్ 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

28న జాబ్‌మేళా

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 26 : నిర్మల్ జిల్లాలోని నిరుద్యోగ యువతులకు పలు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 28వ తేదీన నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లింగ్ ఆపరేటర్, టెక్నికల్ టీం సపోర్ట్, క్వాలిటీ చెకర్స్ వంటి ఉద్యోగాలు 200 వరకు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 28 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఆసక్తి గత నిరుద్యోగ యువతులు సంబంధిత ధృకరణ పత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

నిర్మల్ అర్బన్, మార్చి 26 : మున్సిపల్ ఇంటి పన్నులపై వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నిర్మల్‌లోని 42 వార్డుల ప్రజలు తమ ఇంటి పన్ను చెల్లింపులో పాత బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీని చేయడం జరుగుతుందని 10 శాతం వడ్డీతో పాత బకాయిలు చెల్లించాలని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్మల్ ఆర్డీవోను కలిసిన డీఎం

నిర్మల్ అర్బన్, మార్చి 26: నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పండరి బుధవారం నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణిని ఆర్డీవో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఇక్కడ అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, టీవీ రమణ ఉన్నారు.

పత్రాలు లేకుండా వాహనాలు నడపవద్దు

బజార్‌హత్నూర్, మార్చి 26: ధృవీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడపవద్దని బోథ్ సీఐ వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. వీధుల్లో తిరుగుతు గ్రామస్తుల వద్ద ఉన్న వివిధ వాహనాల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మైనార్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని చట్టరీత్యా నేర మని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అప్పారావు, ఏఎస్ఐ లింబాజీ, ధార సింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాయ మాటలు చెప్పి తులం బంగారం మాయం

ఇచ్చోడ, మార్చి 26: మాయ మాటలు చెప్పి తులం బంగారం దుండగులు దొంగలించిన ఘటన బుధవారం ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన ముల్కుల లక్ష్మి గాంధీనగర్ బస్టాండ్ సమీపంలో బస్సు కోసం వేచి చూస్తుంది. కొందరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అందులో ఒకరు నా భార్య బంగారం పోయిందని, మేము చెక్ చేస్తున్నామని ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు తీసి ఇవ్వు అనగా ఆమె వారి మాటలు నమ్మి తన బంగారం గొలుసు ఇచ్చింది. వారు బంగారు గొలుసును చూసి నాకు తిరిగి ఒక పేపర్‌లో చుట్టి ఇచ్చారు. ఆమె పేపర్ తీసి చూడగా అందులో బంగారు గొలుసు లేదన్నారు. రెండు చిట్టిలు చుట్టి ఆమెకు ఇచ్చేశారు. అంత లోనే గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై పారిపోయారు. బంగారు గొలుసు అది ఒక తులం ఉంటుందని ఆమెను నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాల ద్వారా నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

న్యాయవాది హత్యకు వ్యతిరేకంగా నిరసన

నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

బోథ్, మార్చి 26: రంగారెడ్డి కోర్టు న్యాయవాది ఇజ్రాయేల్‌పై జరిగిన హత్యకి నిరసనగా బుధవారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బోథ్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్ రావ్ దేశ్ పాండే మాట్లాడుతూ న్యాయవాదుల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలతో న్యాయవాదుల సంరక్షణ చట్టం తీసుకురావాలన్నారు. దాడి చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంగద్ కేంద్రే, రూపేందర్ సింగ్ ఠాకూర్, ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్ కుమార్, దమ్మాపాల్, జమీర్, ఎట్టం రాములు, వివేక్ సింగ్, గంగసాగర్ పాల్గొన్నారు.

ఆరుగురు ఉపాధ్యాయులకు నోటీసులు

లక్ష్మణచాంద, మార్చి 26: ఉపాధ్యాయుల సమయ పాలనేది అనే అంశంపై బుధవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి మండల విద్యాధికారి అశోక్‌వర్మ స్పందించారు. సమయ పాలన పాటించని ఆరుగురు ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో అలసత్వం పాటించిన ఉపాధ్యాయులపై నిబంధనల ప్రకారం కఠ